నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | NALGONDA


## పశువులకు మేతగా వరి పంట

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 10 : కాళేశ్వరం జలాలు రాకపోవడంతో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని వరి పొలాలు ఎండిపోతున్నాయి. యాసంగిలో వేసిన పంటలు పొట్ట దశకు వస్తుండగా సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని నంద్యాలవారి గూడెం, గట్టికల్లు, ఇస్తాలాపురం, మొక్కుడుదేవుల పల్లి, రామన్నగూడెం, శెట్టిగూడెం, రామోజీతండా, తుమ్మల పెన్‌పహాడ్, తెట్టేకుంట తండాల్లో వందల ఎకరాల్లో పంటలు నీళ్లు లేక దెబ్బతింటున్నాయి. రామోజీతండాలో సుమారు 25ఎకరాల పంట ఎండి పోయింది. దాంతో చేసేదేమీ లేక రైతులు వరి పైరును పశువులకు మేతగా వదిలేస్తున్నారు. పూర్తి స్థాయిలో గోదావరి జలాలు విడుదల చేసి పంటలను కాపాడా లని రైతులు కోరుతున్నారు.



ఆత్మకూర్.ఎస్ మండలం రామోజీతండాలో ఎండిన వరి పంటను పశువులకు మేతగా వదిలేసిన రైతులు

# బిక్కేరు వెలవెల.. రైతన్న విలవిల

## గోదావరి జలాలు విడుదల చేయాలని ఆందోళన

## పొట్టకు వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన

- మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాల్లో సాగు నీటి కరువు
- గంధమల్ల నుంచి చివరి గ్రామాల వరకు నీటిని అందించాలంటున్న రైతులు

**జిల్లాలోని మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాలకు బిక్కేరు వాగు జీవనాధారం. ఈ ప్రాంతంలో సాగు నీటి ప్రాజెక్టులు లేవు. ఈ మూడు మండలాల్లోని గ్రామాల గుండా వెళ్తున్న బిక్కేరు వాగులోనే వందలాది మంది రైతులు ఇసుకలో చేతి బోర్లు వేసుకొని పంపుసెట్లు బిగించుకొని వందలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రైతులు వాగులో పక్కపక్కనే రెండు, మూడు చేతి బోర్లు వేసుకున్నా బిక్కేరు వాగు నీరందిస్తుంది. వానకాలం బిక్కేరు వెంట ఉన్న పంట పొలాలు ఎండి పోతుండటంతో రైతుల ఒత్తిడి మేరకు నీటి పారుదల శాఖ అధికారులు గంధమల్ల రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలు విడుదల చేశారు. ప్రస్తుత యాసంగిలోనూ వరి సాగు చేసిన బిక్కేరు పరీవాహక ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు ఇప్పడు తప్పడం లేదు. నెల రోజుల కింద గంధమల్ల రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలు విడుదల చేయడంతో ఆలేరు నియోజకవర్గంలోని అంబాల వరకు వచ్చి ఆగి పోయాయి. మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు మండలాల్లో చెరువులు, కుంటలు నిండక బోరు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. దాంతో బోర్లు పోయక పంటలు ఎండిపోయే దశకు వచ్చాయి.**

– మోత్కూరు, ఫిబ్రవరి 10



మోత్కూరు మండలం సదర్శాపురం-గుండాల మండలంలోని పెద్దపడిశాలలో బిక్కేరు వాగు చెక్ డ్యామ్ వద్ద రైతుల ఆందోళన

వానకాలం ఇబ్బందుల నేపథ్యంలో ఈ యాసంగిలో బోర్లు, బావుల కింద రైతులు చాలా తక్కువగా సాగు చేశారు. గతంలో ఐదారు ఎకరాలు నాటు పెట్టిన వారు ఇప్పుడు ఒకటి రెండు ఎకరాలకే పరిమితమయ్యారు. ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండి పోవడంతో బిక్కేరు వాగులో నీరు అడుగంటి పోయింది. పంపు సెట్లకు తగినంత నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి పంటకు ఇంకా నెలన్నర పాటు నీళ్లు పారాలి. యాసంగిలో కూడా బిక్కేరు వాగు దిగువ వరకు గోదావరి నీళ్లు వదలితే బోరు, బావుల్లో నీటి మట్టం పెరిగి పంట చేతికి వచ్చే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో రెండు పంటలకు నీళ్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గంధమల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగుకు గోదావరి జలాలు విడుదల చేయడంతో రెండు పంటలకు సాగు నీరు పుష్కలంగా లభించేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో పొట్ట దశకు వచ్చిన వరి పొలాలు ఎండి పోతున్నాయి. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వక పోయినా, తాము బయట అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తే ఇప్పుడు సాగు నీరందక పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### నీళ్లు విడుదల చేయాలని రైతుల ఆందోళన

జిల్లాలోని గంధమల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి గోదావరి జలాలను దిగువకు వచ్చే వరకూ విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు బిక్కేరు వాగు గుండా సాగు నీరందిస్తే సుమారు నలభై, యాభై గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం ఆలేరు నియోజకవర్గంలోని అంబాల శివారు వరకు గోదావరి జలాల రాగానే నిలిపివేశారు. దీంతో మోత్కూరు, అడ్డగూడూరు మండలంతోపాటు గుండాల మండలంలోని పెద్ద పడిశాల గ్రామాల చివరి వరకు గోదావరి జలాలు రావడం లేదు. ఈ మేరకు సోమవారం మోత్కూరు మండలంలోని సదర్శాపురం-గుండాల మండలంలోని పెద్ద పడిశాలకు చెందిన రైతులు పెద్దఎత్తున్న బిక్కేరు వాగులోకి వచ్చి ఆందోళన చేశారు. గోదావరి జలాలను చివరి గ్రామాలకు వచ్చే వరకూ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### గోదావరి జలాలు వదిలి వరి పంటలను కాపాడాలి



బిక్కేరు వాగులో జలాలు అడగంటి పోవడంతో బోర్లు పోయడం లేదు. వాగులోని నీళ్ల మీద ఆధార పడి వరి సాగు చేశాం. ఇప్పుడు రోజు రోజుకు ఎండలు పెరిగి పోయి బోర్లు అడుగంటి పోయినయి. నీళ్లు లేక పొలాలు ఎండి పోతున్నాయి. పొట్టకొచ్చిన పంట పొలాలు ఎండి పోకుండా గోదావరి జలాలను బిక్కేరు వాగులోకి విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

-దొండ నర్సయ్య, రైతు, సదర్శాపురం, మోత్కూరు



వెలిదండ బీఆర్ఎస్ నాయకులు, రైతులతో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

## కేసీఆర్‌ను కలిసిన వెలిదండ గ్రామస్తులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 10 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారితో కేసీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు, రైతులకు కేసీఆర్ భోజనం ఏర్పాటు చేశారు.

కేసీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ వెలిదండ గ్రామశాఖ అధ్యక్షుడు పెండెం వీరస్వామి, ప్రధాన కార్యదర్శి దేవర బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు చెనగాని రామ్‌మోహన్, యూత్ నాయకులు గడ్డం అనిల్, గండు నరేశ్, మండల ఎస్సీ సెల్ నాయకుడు గుంటి వెంకటేశ్వర్లు, ధర్మయ్య, మహేశ్, వెంకన్న, అంజి, శోభన్, జానయ్య, సతీశ్, బాలరాజు, రవీందర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, ఫిబ్రవరి 10 : స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రామన్నపేట బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. బస్సుల సంఖ్య పెంచకుండా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో కొట్లాడుకునే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. హామీలు అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అనే ఆయుధం ద్వారా గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ పాలన చేస్తూ ఫార్మా కంపెనీల పేరుతో వేలాది మంది పేద రైతుల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తిరుగుబాటు రావడం గ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల పెట్టకుండా పూటకోమాట మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచానికి చాటిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని తెలిపారు. అధికార పార్టీ నాయకులు కేసులు పెడితే బయపడవద్దని, అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగు ల నర్సింహ, గాజుల బుచ్చమ్మ, గుండగోని రాము లు, బీరెల్లి ప్రసాద్, ఎడ్ల పురుషోత్తంరెడ్డి, మంగదుడ్ల వెంకన్న, దాసరి సంజయ్‌కుమార్, తవిడబోయిన భవాని, అంతటి శ్రీనివాస్, నోముల వెంకటేశ్వర్లు, షేక్ జానీపాషా, నకిరేకంటి నర్సింహ, పెద్ది బాలనర్సయ్య. పనస సైదులు, రేకల భిక్షం, బెల్లి సుధాకర్, నలమాద సైదులు, రెడ్డిపల్లి మనోహర్, మునుగోటి ఉత్తరయ్య పాల్గొన్నారు.



నామినేషన్ అనంతర సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

## 23 మంది అభ్యర్థులు.. 50 నామినేషన్లు

**ముగిసిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు**

- చివరి రోజు 18మంది అభ్యర్థుల దాఖలు
- నేడు స్క్రూటినీ.. 13న ఉపసంహరణ

నల్లగొండ, ఫిబ్రవరి 10 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ నెల 3నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. ఈ నెల 3 నుంచి ఐదు గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా సోమవారం ఒక్కరోజే 18 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 23 మంది అభ్యర్థులు 50 నామినేషన్లు దాఖలు చేసినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు.

చివరి రోజు 18 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థులుగా దామెర బాబురావు, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, బండారు నాగరాజు, తాటికొండ వెంకటరాజయ్య, ఏలె చంద్రమోహన్, పన్నాల గోపాల్ రెడ్డి, పింగిలి శ్రీపాల్, గంగిరెడ్డి కోటిరెడ్డి, తండు ఉపేందర్, ఎస్.సుందర్ రాజ్, గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, పూల రవీందర్, జెట్టి శంకర్, కొలిపాక వెంకటస్వామి, తలకోల పురుషోత్తం రెడ్డి, లింగిడి వెంకటేశ్వర్లు(ప్రజావాణి), పులి సరోత్తమ్ రెడ్డి(బీజేపీ), బండారు నాగరాజు(ప్రజా ఏక్తా పార్టీ) ఉన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పూల రవీందర్ మీడియాతో మాట్లాడారు. గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అనేక సమస్యలు పరిష్కరించానని, మరో సారి అవకాశం కల్పించాలని కోరారు.

### 27న ఎన్నికలు

నామినేషన్ల స్క్రూటినీ మంగళవారం జరుగనుండగా, ఈ నెల 13న ఉపసంహరణ అనంతరం ఈ నెల 27న ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 12 జిల్లాల్లో మొత్తం ఓటర్లు 25,797 మందికిగానూ సిద్దిపేటలో 166, జనగామ 1,002, హనుమకొండ 5,215, వరంగల్ 2,352, మహబూబాబాద్ 1,663, భూపాలపల్లి 329, ములుగు 628, భద్రాద్రి కొత్తగూడెం 2,022, ఖమ్మం 4,089, యాదాద్రి భువనగిరి 984, సూర్యాపేట 2,664, నల్లగొండలో 4683 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 15,783 మంది, స్త్రీలు 10,314 మంది ఉన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి 200 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆర్వో ఇలా త్రిపాఠి తెలిపారు.

## స్నేహం అమృతతుల్యం

- సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 10 : మనిషి జీవితంలో స్నేహం అమృతతుల్యమైందని సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు రామోజు హరగోపాల్ రాసిన కవితా సంపుటి దోస్తానాను ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఐదు దశాబ్దాల స్నేహాన్ని అక్షర బద్ధం చేసిన అరుదైన కవితా సంపుటి దోస్తానా అని కితాబునిచ్చారు. హరగోపాల్ కవిగా, చరిత్ర పరిశోధకుడిగా తెలుగు సాహితీ చరిత్రలో తనకంటూ ఒక పేజీని ఏర్పర్చుకున్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మంజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెండెం సత్యనారాయణ, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, బండిరాజుల శంకర్, మిట్ట విజయ్‌కుమార్, జి. కుమారస్వామి, ప్రభాకర్, నంది పురస్కార గ్రహీత ఎండీ అబ్దుల్, యంబ నర్సింహులు, అంజయ్య, బాలరాజు, సుధాకర్, సుభాశ్, జయంత్, గఫార్ పాల్గొన్నారు.



దోస్తానా కవాత సంపుటిని ఆవిష్కరణలో మాట్లాడుతున్న సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ



జడ్పీలో పరిషత్ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న జడ్పీ సీఈఓ

## పరిషత్ ఓటర్ల జాబితా విడుదల

నల్లగొండ, ఫిబ్రవరి 10 : పరిషత్ ఓటర్ల జాబితాను అధికారులు సోమవారం విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సర్పంచ్‌తో పాటు పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా రాగా, సోమవారం మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ఓటర్ల జాబితాను జడ్పీ అధికారులు విడుదల చేశారు. మండలాల వారీగా ఈ జాబితా రాగా మొత్తం 10,77,717 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. అందులో పురుషులు 5,33,333, స్త్రీలు 5,44,429, ఇతరులు 55 మంది ఉన్నారు. దీనికి సంబంధించిన జాబితాను జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమకరణ్‌రెడ్డి నల్లగొండ జిల్లా పరిషత్‌లో అందుబాటులో ఉంచారు. జిల్లాలో 33 మండలాలు, 352 ఎంపీటీసీ స్థానాలు ఉండగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారనే కోణంలో అధికారులు ఓటర్ల జాబితాను రూపొందించి విడుదల చేశారు.



మాట్లాడుతున్న బూడిద భిక్షమయ్యగౌడ్

## బీసీ గణనపై ప్రభుత్వం కాకి లెక్కలు

- రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్

యాదాద్రి భువనగిరి, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : బీసీ కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. భువనగిరి పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చిన్న చర్చ పెట్టి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. బీసీ అంశాలు, ఎస్సీ వర్గీకరణ అంశంలో రాజకీయాలు తగవన్నారు. బీసీలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపు అని ప్రశ్నించారు. 'మేమెంత ఉంటే మాకంత వాటా' అంటూ రాహుల్ గాంధీ నినాదం ఇచ్చారని, ఆ ప్రకారం 46.3 శాతం బీసీలు, 10 శాతం బీసీ ముస్లింలతో కలిపి మొత్తం 56 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సకల జనుల సర్వేకు, కుల సర్వేకు 21 లక్షల బీసీ జనాభా తేడా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం సర్వే డేటాను సమీక్షకు పెట్టాలని డిమాండ్ చేశారు.

## గురుకుల నీళ్ల ట్యాంకులో జెర్లు.. బొద్దింకలు

- ప్యాన్లు, లైట్లు కరువు
- కలెక్టర్ హనుమంతరావు పరిశీలనలో వెలుగులోకి..

రామన్నపేట, ఫిబ్రవరి10 : 'పేద అమ్మాయిలయ్యా.. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ చదువుతున్నారు. ఇంత నిర్లక్ష్యమా? నీ ప్రవర్తన బాగాలేదు.. ఉంటవా, పోతవా?' అంటూ జనంపల్లి గురుకుల ప్రిన్స్‌పాల్ రాజాపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రామన్నపేట మండలంలోని జనంపల్లి గురుకుల పాఠశాలను కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిచ్చెన ఎక్కి వాటర్ ట్యాంకులను పరిశీలించారు. బొద్దింకలు, జెర్లు, పురుగులతోపాటు పాకురు పట్టి ఉండడంతో ప్రిన్సిపాల్‌పై సీరియస్ అయ్యారు. ఇలా ఉంటే పిల్లలకు చర్మవ్యాధులు రావా? మండిపడ్డారు. డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడి పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శానిటేషన్ డ్రైవ్ నిర్వహిం చి పరిసరాలు, ట్యాంకులను శుభ్రం చేయించాలని ఎంపీడీఓకు సూచించారు. నల్లాలు, సోలార్ ఫెన్సింగ్, ఫ్యాన్లు, బాత్ రూమ్ పైకప్పులకు ఎస్టిమేషన్ వేసి పంపించాలని పీఆర్ఏఈ చెప్పారు.



గురుకుల పాఠశాల ట్యాంక్‌ను పరిశీలించేందుకు నిచ్చెన సహాయంతో పైకి ఎక్కుతున్న కలెక్టర్ హనుమంతరావు



శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం కార్యాలయం

## శివన్నగూడెం రైతు సొసైటీలో రూ.75లక్షలు స్వాహా

- పాలకవర్గానికి తెలియకుండా వాడుకున్న ఉద్యోగులు
- ఆలస్యంగా వెలుగులోకి.. రికవరీకి చర్యలు

మర్రిగూడ, ఫిబ్రవరి 10 : మండలంలోని శివన్నగూడెం రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్‌సీఎస్) ఉద్యోగులు పెద్ద మొత్తంలో డబ్బులను స్వాహా చేశారు. కంచే చేను మేసింది అన్న చందంగా సొసైటీలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా రూ.75. 50 లక్షలు వాడుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలకవర్గానికి తెలియకుండా 2020 ఫిబ్రవరి నుంచి 2024 డిసెంబర్ మధ్యకాలంలో పలు దఫాలుగా ఒకరు రూ.40లక్షలు, ఇంకొకరు రూ.13లక్షలు, మరొకరు రూ.12.50లక్షలు డ్రా చేసి వారి సొంత అవసరాలకు వాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి

### డీసీసీబీ జిల్లా అధికారికి ఫిర్యాదు

ఈ విషయంపై సంఘం చైర్మన్ బాలం నర్సింహను వివరణ కోరగా తమ సొసైటీలో పనిచేసే ఉద్యోగులు పాలకవర్గానికి తెలియకుండా డబ్బులు వాడుకున్న విషయం నిజమేనన్నారు. ఆ ఉద్యోగులు వాడుకున్న డబ్బులను రికవరీ చేయాలని కోరుతూ గత నెలలో డీసీసీబీ జిల్లా అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సొసైటీలో విడుతల వారీగా ఆడిటింగ్ నడుస్తున్నదని, వాడుకున్న ప్రతి రూపాయిని తిరిగి సొసైటీకి రికవరీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

## కాంగ్రెస్‌కు కోడ్ వర్తించదా?

**యాదగిరిగుట్టలో ఇష్టారీతిన ఫ్లెక్సీలు**

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 10 : యాదగిరిగుట్ట పట్టణంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. కలెక్టరేట్ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న గుట్టలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఇష్టారాతీన ఆ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పాతగుట్ట చౌరస్తాతోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురుగానూ ఫ్లెక్సీలు పెట్టారు. ఇటీవల మల్లాపురం గ్రామంలో మెడికల్ కాలేజీ కోసం గ్రామ యువత దీక్షకు దిగితే ఎన్నికల కోడ్ అంటూ హంగామా చేసిన పోలీసులు, అధికారులకు కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు కనిపించడం లేదా అనే పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.



యాదగిరిగుట్ట ఎంపీడీఓ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ